**హాస్యప్రభ , జనవరి – 1976, పుట : 75, జి. రామలక్ష్మి - హైదరాబాదు**

## నిజాయితీ మనిషి

అనగనగా ఒక సుల్తాన్‌గారు ఉండేవారు. తన రాజ్యంలో నిజాయితీగా పన్నులు వసూలు చేయడానికిగాను ఒక నిజాయితీ గల మనిషిని ఎన్నుకోవాలని ఆయనకు తోచింది.

ఇటువంటి సందర్భాలు వచ్చినప్పుడు ఖాన్ అనే ఆయన సుల్తాన్ గారికి మంచి సలహాలు ఇస్తూంటాడు. ఖాన్ మంచి పండితుడు, సూక్ష్మజ్ఞానం కలవాడు కావటము వలన, ఈసారి కూడా సుల్తానుగారు ఖాన్‌నే సలహా అడిగారు. ఖాన్ కొద్దిసేపు బాగా ఆలోచించి ''ఈ ఉద్యోగానికి అర్జీలు పెట్టుకున్న వారినందరినీ ఏలినవారు తమ సమక్షానికి పిలిపించి వారినందరినీ, తమ ముందు నృత్యం చేయమని ఆజ్ఞాపించండి. అప్పుడు వారిలో ఎవరు నిజాయితీపరుడో, నేను తమకు మనవిచేస్తాను'' అన్నాడు. దానికి సుల్తాన్‌గారు ''సరే'' అని ఒప్పుకున్నారు.

తరువాత, ఉత్తర్వు విని, అర్జీపెట్టుకున్న వాళ్ళంతా వచ్చారు. చీకటిగా ఉన్న ఒక దారి చూపించి, జాకరి తర్వాత ఒకరు, సుల్తాన్‌గారి ఎదుటకు ఆ దారినే వెళ్ళవలసిందిగా ఆజ్ఞ అయింది. దర్బారులో వాళ్ళందరూ సమావేశమయ్యారు.

సుల్తాన్‌గారు వాళ్ళందరినీ చూసి, ''మీ అర్జీలను పరిశీలించాము, మా నిర్ణయం తెలియజేయడానికి ముందు మీరంతా మా ముందు నృత్యం చేస్తే, చూడాలని మాకు కుతూహలంగా ఉంది'' అన్నారు. అది విని, అందరూ ముఖముఖాలు చూసుకున్నారు. ఒక్క మాటకూడా మాట్లాడుకుండా ఊరుకున్నారు. కానీ, నృత్యం మాత్రం ఎవరూ చెయ్యలేదు. చివరికి ఒక యువకుడు మాత్రం ముందుకువచ్చి, ఎంతో బాగా నృత్యం చేశాడు. అప్పుడు ఖాన్ కళ్ళు ఆనందంతో మెరిసాయి.

ఈ యువకుడే ఈ ఉద్యోగానికి అర్హుడు. ఇతనొక్కడే, నిజంగా ''నిజాయితీ మనిషి''! అని సుల్తాన్‌గారికి చెప్పాడు.

సుల్తాన్‌గారు, ''మీరు, ఇతడు నిజాయితీ మనిషని ఎలా కనిపెట్టగలిగారు?'' అని అడిగారు.

దానికి ఖాన్, ఇలా జవాబిచ్చాడు.

‘‘ఏలినవారు నన్ను మన్నించాలి! ఇక్కడ ఒక చిన్న కిటుకు చేసాను. అర్జీలు పెట్టుకున్న వారిని తమ దగ్గరకు ఒక చీకటి దారిగుండా పంపే ఏర్పాటు చేసాముకదా! ఆ దారి పొడుగునా బంగారునాణాలు నింపిన చిన్న చిన్న సంచులు పెట్టించాను. ఆ దారిని వెళ్ళే మనిషి నిజంగా నిజాయితీ పరుడైతే, వాటిని ముట్టడు. చీకటికదా, ఎవరూ చూడటం లేదు కదా, అనీ తప్పుడు పనికి సిద్ధపడటం మానవ సహజం. ఆ తప్పు చేయనివాడే కదా, నిజంగా నిజాయితీ మనిషి. ఇక నృత్యం సంగతంటారా? ఆ నాణాల సంచులు దొంగిలించనవారు, నృత్యం చేస్తే, జేబులన్నీ గలగలలాడతాయి! వీరంతా దొంగిలించారు. కనుకనే నృత్యం చేయలేదు. ‘‘నిజాయితీ మనిషి’’ కనుకనే ఈ యువకుడు నిర్భంయంగా మీ ముందు నృత్యం చేశాడు. అందుకే ఇతన్ని పన్నులు వసూలు చేసే అదికారిగా నియమించమని, తమకు మనవి చేసుకుంటున్నాను.’’ అన్నాడు.

దొంగలంతా సిగ్గుతో తలలొంచుకున్నారు. సుల్తానుగారు వారినందరినీ శిక్షించి, ఖాన్‌ని అభినందించి, ఆ యువకుడికి సంతోషంగా ఉద్యోగం ఇచ్చారు.

నీతి: ఎప్పుడూ నిజాయితీ గల మనిషే పైకి వస్తాడు.